## నష్ట పరిహారం పెంచాలి



జైపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

జైపూర్, ఏప్రిల్ 15 : మండలంలోని నర్వ శివారు నుంచి గోపాలపూర్ వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులు, తమకు నష్ట పరిహారం పెంచాలని కోరుతూ సోమవారం తహశీల్దార్ వనజారెడ్డికి వినతి పత్రం అందించారు. ఇక్కడ భూముల ధర ఎకరానికి రూ.40 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతున్నట్లు తెలిపారు. సుందిళ్ల ప్రాజెక్టులో 2017లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం రూ.8.20 లక్షల పరిహారం చెల్లించిందని గుర్తుచేశారు. ఇందారం ఓపెన్‌కాస్టులో భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.24.60 లక్షల పరిహారం ఇచ్చినట్లు తెలిపారు. మార్కెట్‌లో భూముల ధర ఇంత పెద్ద మొత్తంలో పెరిగినా తమకు ధర నిర్ణయించకుండా నోటీసులు ఇవ్వడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వకపోతే భూములు ఇవ్వబోమని తేల్చి చెప్పారు.

## బోయపల్లి వాసికి జాతీయ పురస్కారం



జగదీశ్వరాచార్యులును సన్మానిస్తున్న తెలుగు వెలుగు సాహితీ ప్రముఖులు

తాండూర్, ఏప్రిల్ 15 : మండలంలోని బోయపల్లి గ్రామానికి చెందిన కొత్తపల్లి జగదీశ్వరాచార్యులును తెలుగు వెలుగు ఉగాది జాతీయ పురస్కారం వరించింది. తెలుగు వెలుగు సాహితీ వేదిక రజతోత్సవాల సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్న ప్రముఖులను ఉగాది జాతీయ పురస్కారాలకు ఎంపిక చేశారు. అందులో భాగంగా జ్యోతిష్య-వాస్తు శాస్త్రంలో విశేష ప్రతిభ చూపిన జగదీశ్వరాచార్యులును హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాజ గాన సభా వేదికలో ఆదివారం ఉగాది జాతీయ మహానంది పురస్కారంతో సత్కరించినట్లు ఆయన తెలిపారు. తెలుగు వెలుగు వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు కన్నెకంటి వెంకటరమణ, రిటైర్డ్ ఐఏఎస్ మానెపల్లి సుబ్రహ్మణ్యం, రిటైర్డ్ జస్టిస్ బెజ్జారం చంద్రకుమార్, వంగాల శాంతికృష్ణ, టీ గౌరిశంకర్, డాక్టర్ దైవజ్ఞశర్మ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 15 : నస్పూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్కే-6 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఆర్‌కే-6గుడిసెలు, శ్యాంనగర్, సంఘమల్లయ్యపల్లె, సీసీసీ యూనియన్ బ్యాంక్ ఏరియా, లక్ష్మినగర్, గాంధీనగర్, చర్చి ఏరియా, సుభాష్‌నగర్, ప్రశాంత్‌నగర్, క్రిష్ణాకాలనీ, పిట్టల కాలనీ, తదితర ప్రాంతాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సామర్థ్యం పెంపునకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ అమర్చుతున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

# 'సరిహద్దు' ఓటు.. సెపరేటు



సరిహద్దు వివాదాస్పదంలోని బోలాపటార్ గ్రామం

- ఒకే ఓటు వేయాలని తేల్చిన ఎన్నికల సంఘం
- రెండు రాష్ట్రాల్లో వేర్వేరు ఎన్నికల తేదీలు
- అయోమయంలో సరిహద్దు గ్రామాల ప్రజలు

కెరమెరి, ఏప్రిల్ 15 : తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ఓటర్లు ఈ సారి ఎటు వేయనున్నారో రెండు రాష్ట్రాల అధికారులు, నాయకులకు అంతుచిక్కడం లేదు. 2019 పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి రావడంతో ఆ ప్రాంత ప్రజలు కొందరు మహారాష్ట్రలో, మరికొందరు తెలంగాణలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కానీ, ఈ సారి ఎన్నికల తేదీలు వేర్వేరుగా మారడంతో ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనే విషయంపై ఏమీ తోచక నాయకులు అయోమయానికి గురవుతున్నారు. రెండు రాష్ట్రాల్లో ఎన్నికలు ఉండడంతో రెండుసార్లు ఓటు వేసేందుకు అనుమతి ఇస్తారా.! ఒకవేళ ఒకే ఓటుకు అనుమతి ఇస్తే ఏం చేయాలో తోచక ప్రజలు సందిగ్ధంలో పడ్డారు.

19న మహారాష్ట్ర పార్లమెంట్ ఎన్నికలు ఉండగా, వచ్చే నెల 13న తెలంగాణ ఎంపీ ఎన్నికలు జరుగనున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు వివాదస్పద గ్రామాల్లోని ప్రజలకు రెండు చోట్లా ఓటు హక్కు ఉన్నది. తెలంగాణ అయినా, మహారాష్ట్ర అయినా ఎన్నికల్లో ఓటు వేసేందుకు సుప్రీం కోర్టు వారికి అవకాశం కల్పించింది. కొన్ని సందర్భాల్లో ఎన్నికల తేదీల్లో కొన్ని నెలల తరబడి జాప్యం ఉన్నప్పుడు ఆ ప్రాంత ఓటర్లు ఒకసారి అటూ, మరోసారి ఇటూ ఓట్లు వేస్తూ రెండు రాష్ట్రల్లోనూ పూర్తిస్థాయిలో ఓటు హక్కు వినియోగించుకున్న సందర్భాలున్నాయి. ఇదే తరహాలో తెలంగాణ-మహారాష్ట్ర కొన్ని రోజుల వ్యవధిలోనే ఎన్నికలు రాగా, ఒక రాష్ట్రం చూపుడు వేలుకు, ఇంకో రాష్ట్రం మధ్య వేలుకు ఇంక్ పూసి సజావుగా ఎన్నికలు జరిపిన సంఘటనలూ ఉన్నాయి. ఈ విధంగా అనేక రకాలుగా జరిగిన ఎన్నికల పరిణామాలను గ్రహించిన ఎన్నికల కమిషన్.. ఒకే ఓటు వేయాలని ఆంక్షలు విధించడంతో పరిస్థితి జఠిలమైంది. దీంతో మహారాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాలకు ఎన్నికలు ప్రతిసారీ సవాల్‌గా మారుతున్నాయి. గతంలో జరిగినట్లే వేలు మార్చి ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారా..? లేదా అడ్డుకుంటారో తెలియని పరిస్థితి నెలకొన్నది. మహారాష్ట్ర, తెలంగాణ పార్లమెంట్ ఎన్నికలకు కేవలం 24 రోజుల తేడా ఉండడంతో ఈ సారి ఎన్నికలు ఎలా నిర్వహిస్తారో వేచి చూడాల్సిందే.



తెలంగాణ ప్రభుత్వం బోలాపటార్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం



మహారాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం



రెండు రాష్ట్రాల ఓటర్ కార్డులతో లేండిగూడకు చెందిన సూర్యవంశీభారతి బాయి

## అక్రమ వడ్డీ వ్యాపారిపై కేసు

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 15 : జిల్లా కేంద్రంలో అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తున్న సీసీసీ నస్పూర్‌కు చెందిన ఎస్ కే ఇమ్రాన్‌పై సోమవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీ ఐ బన్సీలాల్ తెలిపారు. సీసీసీ నస్పూర్‌లో ఆఫీస్ పర్మిషన్ తీసుకొని మంచిర్యాలలోని జగదాంబా కాంప్లెక్స్‌లో ఎస్‌కే ఫైనాన్స్ పేరిట కార్యాలయాన్ని నడిపిస్తున్నాడని పేర్కొన్నారు. సోదాలు చేయగా 67 ప్రామీసరి నోట్లు, 16 బ్లాంక్ చెక్కులు, రూ.7.64 లక్షల నగదు లావాదేవీలకు సంబంధించిన రిజిస్టర్లు సీజ్ చేసినట్లు వివరించారు.

**కాసిపేటలో దాడులు..**

కాసిపేట, ఏప్రిల్ 15 : కాసిపేట మండలంలో అక్రమ వడ్డీ, చిట్టీలు, ఫైనాన్స్‌లపై పోలీసులు ఆకస్మికంగా దాడులు చేశారు. కాసిపేట, ముత్యంపల్లిలో ఏక కాలంలో తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేకుండా చిట్టీలు నడుపుతున్న ముత్యంపల్లికి చెందిన ఇంగు నారాయణపై కేసు నమోదు చేసి, సంతకాలతో కూడిన ఖాళీ ప్రామీసరీ నోట్లు, చెక్కులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## తవ్వారు.. వదిలేశారు..

కాగజ్‌నగర్, ఏప్రిల్ 15 : పట్టణంలోని త్రినేత్ర శివాలయం సమీపంలోని రోడ్డును పైపు లైను పనుల నిమిత్తం తవ్వి, పూడ్చకుండా అలానే వదిలేశారు. దీంతో ఆ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. వారం రోజులు గడుస్తున్నా రోడ్డుపై ఉన్న మట్టిని తొలగించడం లేదని, రోడ్డును సైతం బాగు చేయాడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



త్రినేత్ర శివాలయం సమీపంలో తవ్వి వదిలేసిన రోడ్డు

## అక్రమ నిర్మాణాలు చేస్తే చర్యలు

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 15 : ప్రభుత్వ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేసినా, అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్, తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. డీటీఎఫ్ టీం ఆధ్వర్యంలో సోమవారం నస్పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వేనంబర్ 64 ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్‌లోని హద్దు రాళ్లను తొలగించారు. అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతనే వెంచర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజలు అనుమతిలేని వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి, మోసపోవద్దని తెలిపారు. ఇలాంటి ప్లాట్లు కొనుగోలు చేసి, నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. డీటీఎఫ్ టీం సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సర్వేనంబర్ 64లో నిర్మాణాన్ని తొలగిస్తున్న జేసీబీ

## మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : అమ్మ ఆదర్శ పాఠశాలలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఆదేశించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల్లో మున్సిపాలిటీలో ఉన్న 170 పాఠశాలల్లో బాలికల కోసం ప్రత్యేకంగా నిర్మించే మరుగుదొడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి మే 10 లోపు పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎస్టిమేట్ ప్రజలకు ఇంజనీరింగ్ అధికారులు వెంటనే సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో సురేందర్, డీఈవో అశోక్, ఆర్అండ్‌బీ ఈఈ పెద్దన్న, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం చేయాలి

మందమర్రి, ఏప్రిల్ 15 : బీసీలు వెనుకబడిన వారు కాదని, వెనక్కి నెట్టివేయబడ్డ వారని బీసీ ఐక్య వేదిక నాయకులు అన్నారు. బీసీ జనగణన చేపట్టి, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్య యాత్ర సోమవారం మందమర్రి పట్టణానికి చేరుకున్నది. ముందుగా ఐక్య వేదిక నాయకులు సింగరేణి పాఠశాల సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం మార్కెట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చైతన్య యాత్ర ముగింపు సభలో మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే, అంబేద్కర్ లాంటి మహనీయులు కోరుకున్న సామాజిక న్యాయం అమలు కావాలంటే బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గతంలో బీసీలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. జనాభా ప్రాతిపదికన చట్ట సభల్లో బీసీ ప్రతినిధులు లేకపోవడం వల్లే బీసీ హక్కులు కాలరాయబడుతున్నాయన్నారు. దేశ జనాభాలో 60 శాతం మెజారిటీ ఉన్న బీసీల బాగోగులను నేటి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని, బీసీ జనగణనకు చట్ట బద్ధత కల్పించాలని, దాని ప్రకారం రాజకీయ, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక నాయకులు రంగు రాజేశం, కనుకుంట్ల మల్లయ్య, నీరటి శ్రీనివాస్, డాక్టర్ నీలకంఠేశ్వర్, మిట్ట లక్ష్మణ్, పార్వతి రాజిరెడ్డి, చిలగాని సుదర్శన్, ఎండీ ఇబ్రహీం, నీరటి రాజన్న, పోలు శ్రీనివాస్, డాక్టర్ సదానందం తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

## వరి పంట కోత ప్రయోగం

హాజీపూర్, ఏప్రిల్ 15 : మండలంలోని పెద్దంపేటలో రైతు బెంబడి గురువ్య సాగు చేసిన వరి పంటను హైదరాబాద్ ఆర్థిక శాఖ గణాంక జాయింట్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సత్యం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కల్పన, ఆర్థిక ఉప గణాంక శాఖ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పొలంలో ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. 19.855 కిలోల దిగుబడి వచ్చిందని తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. దిగుబడి ఆధారంగా అంచనా వేసి, తగిన జాగ్రత్తలతో అధిక దిగుబడికి రైతులు కృషి చేయాలని తెలిపారు. వీరి వెంట మండల వ్యవసాయ అధికారి మార్గం రజిత, ఉప గణాంక శాఖ నుంచి పాపయ్య, మండల ప్రణాళిక గణాంక అధికారి రమేశ్, వ్యవసాయ విస్తరణ అధికారి కనుకరాజు, రైతు కూలీలు పాల్గొన్నారు.



పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## ఇందారం అడవిలో అగ్ని ప్రమాదం



మంటలార్పుతున్న సిబ్బంది

జైపూర్, ఏప్రిల్ 15 : మంచిర్యాల అటవీ డివిజన్ పరిధిలోని జైపూర్ మండలం ఇందారం రక్షిత అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. మంచిర్యాల-హైదరాబాద్ ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న అడవిలో మంటలు వ్యాపిస్తున్నాయని అటవీ అభివృద్ధి సంస్థ, మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ జీ సురేష్ కుమార్‌కు ఆదివారం రాత్రి స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన స్పందించి, అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి సమాచారం ఇచ్చి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వాచర్ తుత్తుర్ల శంకర్ సాయంతో ఫైర్ కంట్రోల్ బ్లోయర్లతో మంటలను ఆర్పివేయిస్తూ మంచిర్యాల అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపు చేసింది. ప్రధాన రహదారి వెంట వెళ్లేవారు సిగరెట్, బీడీలు తాగి పడేయడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్లాంటేషన్ మేనేజర్ సురేష్‌కుమార్ తెలిపారు.

## అలరించిన అష్టావధానం



శతావధాని పట్వర్ధన దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

చెన్నూర్ టౌన్, ఏప్రిల్ 15 : చెన్నూర్ పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ నిర్వహించిన కవిసమ్మేళనం అలరించింది. శతావధాని మారెపల్లి పట్వర్ధన్ నేతృత్వంలో పృచ్ఛకులు తమ ప్రశ్నలను సంధించి, కార్యక్రమాన్ని రంజింపజేశారు. సంచాలకులుగా జక్కెపల్లి నాగేశ్వర్ రావు, పృచ్ఛకులుగా మేకల రామస్వామి, దబ్బెట రాజమల్లు, బొడ్డు మహేందర్, మహవాది సుభాష్, వేదాంతం సురేశ్ బాబు, భాగ్యలక్ష్మి, డాక్టర్ శంకర్ లాల్ లాహోటీ, ఘంటానాదం కొదుగుళ్ల పద్మనాభాచారి వ్యవహరించారు. అప్రస్తుత ప్రసంగంతో కొమ్మెర రామమూర్తి ఆకట్టుకున్నారు. వీరిని శాలువా, మెమెంటోలతో నిర్వాహకులు సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని రిటైర్డ్ వ్యాయామోపాధ్యాయుడు కారెంగుల రామయ్య, ఆలయ అర్చకుడు వేమారపు సత్యమూర్తి, గురుస్వాములు పద్మనాభాచారి, వేదాంతం సురేశ్ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## చర్యలు తీసుకోవాలి

బెజ్జూర్, ఏప్రిల్ 15 : మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన శ్మశాన స్థలాన్ని కొందరు ఖబ్జా చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం తహశీల్దారు భూమేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తొర్రెం బాణయ్య, గజం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఆయుర్వేద వైద్య శిబిరం

మందమర్రి, ఏప్రిల్ 15 : మందమర్రిలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో 17న హైదరాబాద్‌కు చెందిన మాతా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ సోమవారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వైద్యుడు విశ్వనాథ మహర్షి చికిత్స అందిస్తారని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరానికి ఇంతకుముందు హాజరైన వారితో పాటు, పట్టణంలోని సింగరేణి కార్మిక కుటుంబాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**నేడు గోలేటిటౌన్‌షిప్‌లో..**

రెబ్బెన, ఏప్రిల్ 15 : బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్ సీఈఆర్‌క్లబ్‌లో మంగళవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించటం జరుగుతుందని బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైద్రాబాద్‌కు చెందిన ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ మహర్షి హాజరై వైద్య పరీక్షలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు.

## దరఖాస్తు గడువు పొడిగింపు

రెబ్బెన, ఏప్రిల్ 15 : సింగరేణి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై శిక్షణ ఇస్తున్నట్లు, దరఖాస్తు గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి ప్రాంతానికి చేందిన యువతీయువకులు అర్హులని, వెబ్‌సైట్ ద్వారా 30వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఏరియా అభ్యర్థులు గోలేటిలో దరఖాస్తు అందించాలని సూచించారు.

## నేడు మండల పరిషత్ సమావేశం

హాజీపూర్, ఏప్రిల్ 15 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్ సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

## ఎన్ఎస్ఎస్ వలంటీర్ల రక్తదానం

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 15 : మంచిర్యాలలోని మిమ్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోమవారం రక్తదానం చేశారు. జననీ బ్లడ్ బ్యాంక్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 50 మంది వలంటీర్లు, సిబ్బంది రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పీ ఉపేందర్‌రెడ్డి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపాల్ పీ శ్రీధర్‌రావు, డైరెక్టర్ విజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఓదెలు, రవికుమార్, జననీ బ్లడ్‌బ్యాంక్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సతీశ్ పాల్గొన్నారు.

## కిరాణంలో దాడులు

సిర్పూర్(టీ), ఏప్రిల్ 15 : మండలకేంద్రంలోని సోమవారం పంకజ్ కిరాణా దుకాణంలో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఏంఎ జలీల్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పంకజ్ కిరాణంలో బియ్యం బస్తాలను తూకం వేసి పరిశీలించగా 26 కేజీల బియ్యం బస్తాల్లో తేడాలు అధికారులు గమనించారు. ఒక్కో బియ్యం బస్తాలో 950 గ్రాములు తక్కువ రావడంతో యజమాని పంకజ్‌పై కేసు నమోదు చేసి, రూ 20వేలు జరిమాన విధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులను మోసం చేస్తే దుకాణా యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. వినియోగదారులు తుకాలు సరిచూసుకోని కోనుక్కోవాలని సూచించారు.

## పోలీసుల ఫ్లాగ్ మార్చ్

కౌటాల, ఏప్రిల్ 15 : మండలంలోని ముత్తంపేట గ్రామంలో సోమవారం ఎస్ఐ మధుకర్, సీఆర్పీఎఫ్ జవాన్‌లతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కౌటాల సీఐ సాదిక్ పాషా అన్నారు. గ్రామంలోని ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. నాటుసార తయారికి ఉపయోగించే సామాగ్రిని ధ్వంసం చేసి పలు సూచనలు చేశారు.

## ఆర్టీసీ ఆధ్వర్యంలో అవగాహన

చెన్నూర్, ఏప్రిల్ 15 : చెన్నూర్ బస్టాండ్‌లో సోమవారం ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మంచిర్యాల డిపో అధికారులు వివరించారు. ఆర్టీసీ అందిస్తున్న సేవలను తెలియజేశారు. తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, బైక్‌లపై ప్రయాణించినప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరిరంచాలని సూచించారు. ఆర్టీసీ మంచిర్యాల డిపో ఏడీసీఎం ప్రసాద్, సేఫ్టీ వార్డెన్ జీఆర్ మాళి, చెన్నూర్ పా యింట్ కంట్రోలర్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

కన్నెపల్లి, ఏప్రిల్ 15 : కన్నెపల్లి మండలం మెట్‌పల్లి గ్రామంలో ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ ఐకేపీ మహిళలు, రైతు లు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని సమాచారం లేకుండానే తీసేశారని, దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వీవో సభ్యురాలు శకుంతల, రైతులు పాల్గొన్నారు.

## 9 మంది అరెస్ట్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 15 : గొడవ కేసులో 9 మంది నిందుతులను సోమవారం అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల సీఐ బన్సీలాల్ తెలిపారు. శనివారం అర్ధరాత్రి మంచిర్యాల పట్టణంలోని ఇందూబార్ సమీపంలో మద్యం మత్తులో రోడ్డుపై రెండు వర్గాల యువకులు గొడవ పడి వీరంగం సృష్టించారు. ఆదివారం ఇరువర్గాల యువకులు కేసు పెట్టగా, నిందుతులను అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం లక్షెట్టిపేట జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు. మరికొందరు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకుంటామని పేర్కొన్నారు.

## రూ.12 లక్షలు పట్టివేత

కోటపల్లి, ఏప్రిల్ 15 : కోటపల్లి మండలం పారుపల్లిలో మంచాల సంతోష్ ఇంట్లో నిల్వ ఉంచిన రూ.12,21,200ను సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. సమాచారం మేరకు తనిఖీ చేయగా, నగదు లభించినట్లు వివరించారు. ఆధారాలు లేకపోవడంతో ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులు యూనస్, అక్తర్ మోహియొద్దీన్‌కు అప్పగించినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677